# నైజం

- జి.మేరీకృపాబాయి



ఆ రోజు గీత వాళ్లింట్లో పేరంటానికి ఎక్కువ మందే హాజరయ్యారు.

కార్యక్రమం అంతా అయిపోయిన తర్వాత సీత, లత మిగిలిపోయారు.

"ఈ టైంలో ఇంటికెళ్ళి మాత్రం చేసేదేముంది కాసేపు ఇక్కడే కూర్చోండి" అంది గీత వాళ్లిద్దరినీ ఉద్దేశించి.

"సరే ఒక అరగంట ఉండి వెళతాంలే" అంటూ సీత, లత కూడా కుర్చీల్లో కూర్చున్నారు నింపాదిగా.

కాలక్షేపం కబుర్లు మొదలుపెడుతూ "అవునూ రాధ పేరంటానికి రాలేదేమిటి?"ఏదో కొత్త విషయం కనిపెడుతున్నట్లుగా అంది సీత.

"ఆ.. ఆవిడకి ఇటువంటి చిన్నచిన్న పేరంటాలు ఏమి నచ్చుతాయి. గ్రాండ్ ఫంక్షన్స్ అయితే వస్తుంది" నిష్ఠూరంగా అంది లత.

"ఏదో పెద్ద గొప్పదాన్నని అనుకుంటుంది గానీ కట్టేవన్నీ ఓల్డ్ మోడల్ చీరలే ఆవిడ పనులే ఆవిడకి గొప్ప" అంది గీత.

"ఆసలు ఆవిడ బుద్ధికూడా మంచిదికాదు. బాగా స్వార్థపరురాలు" అంది సీత తనూ వంత పలుకుతూ.

"ఎంతైనా గీత చాలా విశాల హృదయురాలు. మనస్తత్వం కూడా చాలా మంచిది" మెచ్చుకోలుగా అంది లత.

గీత ఉబ్బితబ్బిబ్బైపోయింది.

"అసలు రాధకి పని మనుషులతో కూడా రోజూ గొడవేనట" ఫిర్యాదు చేస్తున్నట్లుగా అంది సీత.

"రాధ భర్త కూడా అంత నిజాయితీపరుడేం కాదట. ఆఫీసులో ఆమ్యామ్యాలు బాగా తీసుకుంటాడట" అంది లత.

"రాధ క్యారెక్టర్ కూడా మంచిది కాదట... ఆ మధ్య ఎవరితోనో..." ఏదో అనబోయింది గీత.

మధ్యలోనే అందుకుంటూ "ఆ...చాలామంది ఆడవాళ్ళు ఈ రోజులలో అంతేలే. మనలా పవిత్రంగా ఎవరూ ఉండరు" అంది లత.

ఇంతలోనే సీత దగ్గర సెల్‌ఫోన్ మోగింది.

"హలో.." ఏదో మాట్లాడింది సీత.

"మా ఇంటికి బంధువులు వచ్చారట. నేను వెళ్లొస్తాను" అంటూ వెళ్ళిపోయింది సీత.

★ ★ ★

"ఇంకా ఏమిటీ విశేషాలు?" అంది గీత.

"ఏముంది? కబుర్లు బాగానే చెబుతుంది గానీ ఈ సీత కూడా తక్కువదేం కాదు" అంది లత.

"అవును చాలా పిసినారి. స్వార్థం కూడా ఎక్కువే. అందరూ తన మాటే వినాలనుకుంటుంది. మరీ అటువంటి బుద్ధి పనికిరాదు" చికాకుగా అంది గీత.

"ఇంట్లో కూడా తన మాటే నెగ్గాలనుకుంటుందిట" అంది లత.

"అవును అత్తగార్ని కూడా బాగా సాధిస్తుందట" నిష్ఠూరంగా అంది గీత.

"సరే అటువంటి వాళ్ల గురించి మనకెందుకు గానీ నే వెళ్ళొస్తా" అంటూ లేచింది లత.

తమ మధ్య లేని మూడోవ్యక్తి గురించి జనం ఇలాగే మాట్లాడుకుంటారు.

జనం నైజం ఇది అని అనుకోవడం తప్ప మనం చేయగలిగిందేమీ లేదు.

★